# అందరి తల్లి !

## శ్రీమతి కంభంపాటి కృష్ణకుమారిగారు



గురుప్రసాద్ కంభంపాటి



# అందరి తల్లి!

## శ్రీమతి కంభంపాటి కృష్ణకుమారిగారు

గురుప్రసాద్ కంభంపాటి

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 22-07-2020 ప్రతులు : 500
(మాతృశ్రీ కృష్ణకుమారిగారి జన్మదినోత్సవము)

© ధనిష్ఠ ఫౌండేషన్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

ప్రతులకు :

❖ **ధనిష్ఠ ఫౌండేషన్,**
15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.
ఫోన్ : 0891-2701531, 2509154.

Website : www.dhanistha.org.
info@dhanistha.org.

❖ **జగద్గురుమందిరము / ధనిష్ఠ ఫౌండేషన్,**
14-38-2, రాధామాధవం, ముప్పిడి కోలని, విశాఖపట్నం - 530 002.

ISBN : 978-81-89467-46-3

ముద్రణ :

**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**
విశాఖపట్నం - 530016.
ఫోన్ : 0891-2796538, 984 999 6538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.



# అందరి తల్లి!

## శ్రీమతి కంభంపాటి కృష్ణకుమారిగారు

**కృతజ్ఞతలు :**

మాతృమూర్తి శ్రీమతి కృష్ణకుమారిగారు మూర్తీభవించిన అన్నపూర్ణ మరియు శ్రీమహాలక్ష్మి. మాస్టర్ పార్వతీకుమార్‌గారి ధర్మపత్ని, సహధర్మచారిణి. మాస్టర్ ఇ.కె. మానస పుత్రిక. ఆమె తేది 17-4-2020నాడు దివంగతులైన సందర్భముగ ఆమెను గూర్చి కుమారునిగ నేనెరిగిన నా తల్లిని పరిచయము చేయుట నా బాధ్యతగా భావించి, నాకున్న స్ఫూర్తి ననుసరించి ఈ చిన్న ప్రయత్నం చేస్తున్నాను.

నా జీవితము నేటి వరకు (44 సం॥లు) నేను నా తల్లిగారి నుండి పరిపూర్ణమైన ప్రేమ, అనురాగము, జీవము పొందినవాడను. ఆమెను సంతోషపెట్టుటయే ప్రధాన కర్తవ్యముగ నేటికిని జీవించు

చున్నాను. తల్లిగా ఆమె కోరినది ఆనందమయమగు కుటుంబము మరియు పొరపొచ్చములు లేని కుటుంబ వ్యవస్థ. ఆమె అందరి తల్లిగ స్వభావమున అన్ని కుటుంబములు బాగుండాలని తపన చెందుతూ ఉండేవారు. ఆమె జీవితాన్ని తన కుటుంబమునకే పరిమితము చేయకుండ వేలాది కుటుంబములకు భౌగోళికముగ తల్లివలె నిలచినారు. అందరియందు ప్రేమ, ఆదరణ, సహజ స్ఫూర్తితో కలిగిన సలహాలను మాస్టరుగారి అనుయాయు లందరికిని వర్షిస్తూ ఉండేవారు. మాస్టరుగారి మౌనం, అమ్మగారి మాట అన్ని బృందము లకు స్ఫూర్తిదాయకంగా ఉండేది.

ఆమె బృందము నందలి సభ్యులను పరికిస్తూ, వారి అవసరా లను సులభముగ గుర్తిస్తూ, అతి సులభమైన పరిష్కారాలు అందిస్తూ ఉండేవారు. ఎల్లప్పుడు మాస్టరుగారిని కూడి ఉండేవారు. స్వదేశమైన, పరదేశమైన అమ్మగారు మాస్టరుగారిని నీడవలె అనుసరించేవారు. తల్లివలె పోషించేవారు. మంత్రివలె స్ఫూర్తిమంతమగు సూచన లిచ్చే వారు. ఆమె మాటకు మాస్టరుగారు ఎప్పుడూ విలువ నిచ్చేవారు.

అమ్మగారులేని, నాన్నగారు (మాస్టరుగారు) బృందములకు ఒక రకమగు అసంపూర్ణత కనిపించేది. మాస్టర్ ఇ.కె. మాటలలో చెప్పాలంటే **"ఈ పంతులుగారు (మాస్టర్ కుమార్‌గారు) గాలిపటం లాంటివాడు. అతనికేమీ వ్యక్తిగత అవసరాలు లేవు. వదిలేస్తే ఎగిరి పోతాడు. నీవు (అమ్మగారు) సూత్రం లాంటి దానివి. నీవు, నేను ఇతన్ని పట్టి ఉంచితే పనులవుతాయి."**

అమ్మగారు సంపూర్ణమైన స్త్రీ శక్తి, ఆదర్శ స్త్రీ, ఆదర్శ గృహిణి. కుమార్తెగ, భార్యగ, కోడలిగ, బంధువుగ, శిష్యబృందములకు తల్లిగ ఆమె నిర్వహణము ఎన్నోవేల హృదయములలో చెరగని ముద్రవేసింది. అట్టి మాతృమూర్తిని గూర్చి నే నెరిగినవి, నా తండ్రిగారు నుండి అపుడపుడు విన్నవి తెలియజేయు ప్రయత్నమే ఈ చిరు పుస్తకము. మాతృమూర్తికి ఆమె దేహత్యాగానంతరము నేనందించు ప్రథమ పుష్పము.

## 2. జననము - బాల్యము :

మాతృశ్రీ కృష్ణకుమారిగారు 1951వ సం॥ము జులై 22వ తేదీ ఆదివారం, గుంటూరులో ఉదయం 7 గం॥లకు జన్మించారు. ఆమె తండ్రి బ్రహ్మశ్రీ గూటాల సోమేశ్వరరావుగారు, తల్లి శ్రీమతి సత్యవతి. శతభిష నక్షత్రంలో జననం సంభవించింది. తల్లిదండ్రులు చక్కని సంప్రదాయము గలవారు. సంప్రదాయమును యాంత్రికముగ గాక శ్రద్ధాభక్తులతో నిర్వహించెడివారు. కృష్ణకుమారిగారు ఈ కళ్యాణ గుణమును తల్లిదండ్రులనుండి స్వతహాగ పొందినటువంటివారు.

పుట్టినది గుంటూరు గడ్డ అయినను, తన తండ్రి గారిది పశ్చిమ గోదావరి నందలి ఏలూరు పట్టణమైనను, పెరిగినది హైదరాబాదు మహానగరమున. తండ్రిగారు ఇండియన్ ఎయిర్‌లైన్స్ నందు రేడియో ఇంజనీరు అయి ఉండుట వలన బాల్యము నుండి జీవనము హైదరాబాదు నందే జరిగినది. ఆమె తల్లిదండ్రులకు రెండవ



సంతానము. తండ్రిగారైన శ్రీ సోమేశ్వర రావుగారు ఆత్మావలంబనము కలిగి, స్వయంకృషితో జీవనమున వృద్ధి చెందిన వారు. స్వయంకృషి వారి బలం. తల్లి గారు దైవభక్తి, సంప్రదాయము మిక్కుట ముగ పాటించే వారు. శ్రీమతి కృష్ణ కుమారిగారి యందు ఆ రెండు కళ్యాణ గుణములు చక్కగ భాసించినవి. తల్లి దండ్రు లిద్దరును ఆమె సంకల్ప బలమునకు, స్వాలంబనమునకు, దైవభక్తికి ముచ్చట పడుతూ ఉండేవారు. సమకాలికులలో ఆమె రూపసిగ ప్రశంసింపబడు చుండెడి వారు.



ఒకమారు శ్రీ కుమార్‌గారితో సోమేశ్వరరావుగారు ఈ విధముగ పలికిరి : "కుమారికిగల శ్రద్ధ, భక్తి, స్ఫూర్తి, దైవభక్తి, ఓపిక, చరుకుదనము నాకు చాలా ముచ్చట కలిగిస్తుంది. ఆమె నా ప్రాణ పుత్రిక."

మాస్టర్ ఇ.కె. గారి ఆత్మ పుత్రిక, సోమేశ్వరరావుగారి ప్రాణ పుత్రికగ భాసించినదని మాస్టర్ కుమార్‌గారు భావించారు.

శ్రీమతి కృష్ణకుమారిగారి విద్యాభ్యాసము నిరాటంకంగ ఉపాధ్యాయునుల మన్ననలతో సాగిపోయింది. ఇరవై (20) సం॥లకే పట్టభద్రురాలై తల్లిదండ్రులను అన్ని విధముల సంతోష పరచినారు.

### 3. భక్తి మార్గము :

పెద్ద కూతురుగ తల్లికి చేరువగ, చేదోడు వాదోడుగ కృష్ణ కుమారిగారు తల్లికి సహాయకారిణిగ నుండెడివారు. వంటపనులు, ఇంటిపనులతోపాటు తల్లి వద్దనున్న భక్తిమార్గానికి ఆకర్షింపబడ్డారు. భక్తిగానము, భజన నిర్వర్తించునపుడు తన్మయత్వము పొందుట ఆమెకు కడసారివరకు తోడై యుండెడిది. మనసుకు బాధ కలిగినపుడెల్ల తానుగ భజన, గానము భక్తితో నిర్వర్తించుచు ఊరట పొందెడివారు. తల్లిగారితో తరచు శ్రీ సత్యసాయి బాబా భజనలకు జనుట, పుట్టపర్తి వెళ్ళి సేవా కార్యక్రమములలో పాల్గొనుట ఆమెకు అత్యంత ప్రీతి పాత్రమైన అంశములుగ నుండెడివి.

చిన్నతనముననే షిరిడిసాయి స్ఫూర్తిగల ఒక స్త్రీ కృష్ణకుమారి గారికి 'షిరిడిసాయి రూపును' అదృశ్యము నుండి తీసి యిచ్చుట ఒక విశేషము. భక్తి ప్రధానముగ మాతృశ్రీ కృష్ణకుమారిగారి జీవితము సాగినది. మాస్టర్ కుమార్‌గారి బోధనల నన్నిటికి ఆమె ప్రధాన

శ్రోత. జ్ఞానమునకు హృదయ ముప్పొంగినను, భక్తియే ప్రధానముగ ఆమె జీవితము సాగినది. అందులకు ఆమె తల్లిగారు, అటుపైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబాగారు వలసిన పునాది వేసినారు. అట్లే సేవాకార్యక్రమముల యందు కూడ ఆమె ముందు వరుసలో నుండెడి వారు. జీవితమున ఆమెకు భక్తి, సేవ, జ్ఞానము మిక్కుటముగ అనుగ్రహింపబడిన వనుటలో అతిశయోక్తి లేదు. ఈ మార్గమున ఆమె సున్నితముగ శ్రీకృష్ణగతిని చేరి కడకు కృష్ణ సాన్నిధ్యమును గూడ పొందిరి. కృష్ణ స్ఫూర్తి కారణముగ వారు కృష్ణమాచార్య గురుదేవుల సన్నిధి చేరుట మముబోంట్లకు విశదమై యున్నది.

విద్యాభ్యాసమంతయు క్రైస్తవ విద్యాలయంలో సాగుటచే మాతృశ్రీ కృష్ణకుమారిగారికి ఏసుక్రీస్తు అనిన కూడ చాల భక్తి శ్రద్ధ లుండెడివి. ఆమె మాస్టర్ కుమార్‌గారికి లేఖకురాలుగ చివరిగా వ్రాసిన పుస్తకము 'ఏసుక్రీస్తు జీవితము'. దేహ త్యాగమునకు మూడు వారములు ముందుగ ఏసు జీవిత చరిత్ర ఇరువురును కలసి పూర్తి చేసిరి.

## 4. వివాహము, కుటుంబము :

పట్టభద్రురాలైన శ్రీమతి కుమారిగారికి 20 సం॥లు నిండు తుండగనే తల్లిదండ్రులు వివాహ ప్రయత్నము ప్రారంభించినారు. చుట్టుపక్కములు కూడ ఒత్తిడి చేయుట ప్రారంభించిరి. పెళ్లి కళ వచ్చినదని, పెళ్లి చేయుట సమంజసమని బంధుమిత్రులు చెప్పగా,

ప్రయత్న మారంభించిరి. సాటివారిలో మాతృశ్రీ కృష్ణకుమారిగారు కొట్టవచ్చినట్లుగ పొడుగుగను, సన్నగను, రంగుగను ఉండెడివారు. ఆమె కన్నుల కాంతి ప్రత్యేకమై నవ్వినపుడెల్ల ముఖము వికాసవంతమై గోచరించెడిది. నల్లగ, ఒత్తుగ నుండు శిరోజములు సుదీర్ఘములై యుండెడివి. నాటికిని, నేటికిని ఆమె నవ్వు, ఆమె చూపు అందరి హృదయములలో స్థాన మేర్పరచుకొన్నది.


శ్రీ సోమేశ్వరరావుగారి మిత్రుని ద్వారా వారికి విశాఖపట్నం వాస్తవ్యులైన శ్రీ పార్వతీకుమార్‌గారి వివరములు తెలియవచ్చినవి. విద్య, బుద్ధి, సంస్కారము, అందము, పొడవు, అన్ని అంశములను శ్రీ కుమార్‌గారు కోరదగిన వరుడుగ భావించి, వారి కుటుంబ పెద్దలకు తమ ప్రతిపాదన తెలియపరచినారు. ఇది యంతయును 1971 అక్టోబరు నెలలో జరిగినది. ప్రతిపాదనము స్వీకరించిన శ్రీ కుమార్‌గారు, తనకప్పటికే పరిచయమైయున్న పవిత్రమూర్తి మాస్టర్ ఇ.కె. గారిని కలిసి ప్రతిపాదనను విన్నవించి, వారి సలహాను ఇట్లని కోరినారు. "మాస్టరుగారూ! నాకు వివాహము జరిపించుటకై ప్రతిపాదనలు రాసాగినవి. కాలయాపన చేయుచో అధికమగు ప్రతిపాదనలు వచ్చు ప్రమాదమున్నది. మా వద్దకు వచ్చిన ఈ మొదటి ప్రతిపాదనయే కుదిరినచో నేను కృతకృత్యుడను కాగలను. పదిమంది కన్యలను చూచుట నా కిష్టము లేదు." ఇట్లు పలికి జాతక వివరము లను మాస్టర్ ఇ.కె. గారికి అందించిరి.

మాస్టరుగారు సంతోషముగ జాతకమును అందుకొని హుటా హుటిని కుమార్‌గారితో కలిసి మరియొక రహస్య నివాసమునకు చేరిరి. అచట ఏకాంతముగ శ్రీ కుమార్‌గారు, శ్రీమతి కుమారిగార్ల జాతకములను క్షుణ్ణముగ పరిశీలించిరి. దాదాపు 45 నిమిషముల పాటు పరిశీలనము చేసిరి. అంత తడవు శ్రీ కుమార్‌గారు ఆ నివాసమున నున్న పవిత్ర గ్రంథములను పరికించుచుండిరి. మాస్టరు గారి దీర్ఘ పరిశీలనము గమనించిన శ్రీ కుమార్‌గారు, మాస్టరుగారితో ఇట్లని పలికిరి. "ముహూర్త మాత్రమున జాతకములు పరిశీలించి సలహా నిచ్చు మీరు ఇంత తడవు పరిశీలించు చున్నారేమి?" దానికి మాస్టరుగారు సమాధానముగ **"నీవు నాకు చాల ముఖ్యుడవు. నిన్ను వివాహమాడు స్త్రీ నీ కన్నివిధముల తోడై యుండవలెను. అపుడు నీ పని, నా పని కూడ సులభమగును. కనుక నీ జాతకమును, చిరంజీవి సౌభాగ్యవతి కృష్ణకుమారి జాతకమును క్షుణ్ణముగ పరిశీలించితిని. మీ ఇరువురి జాతకములను పరిశీలింపగ, ఇరువురును సరిసమాన మగు సంస్కారములు గలవారని విశదమైనది. మీరొకరికొకరు దీటైనవారు. తూకము వేసినచో రెండు జాతకములు సరిసమానము గను, సామరస్యముగను నున్నవి. కనుక నీవీ కన్యను నిస్సంకోచముగ వివాహ మాడవచ్చును."**

గురువాజ్ఞ తక్షణ కర్తవ్యమన్నట్లుగ, పెద్దల ఆశీర్వచనమున ఇరువురి వివాహమైనది. శ్రీ పార్వతీకుమార్‌గారు, శ్రీమతి కృష్ణకుమారి



గారు తేది 09-04-1972న వివాహ బంధమునకు కట్టు బడిరి. అప్పటినుండి ఏప్రిల్ 2020 సం॥ వరకు వైవాహిక జీవితమును అన్ని విధములుగ పరిపూర్తి గావించిరి. ఆమె జన్మించినది ఆదివారము. ఆమె వివాహము ఆదివారము ఉ॥ 7-30 ని॥లకు జరిగినది. ఆమె దేహదహనము కూడ ఆది వారమే జరిగినది. ఆమె వివాహ సమయమున చిరుజల్లు ముహూర్తమునకు పడుట ఒక విశేషము.



వివాహానంతరము మాతృశ్రీ కృష్ణకుమారిగారు విశాఖ వాస్తవ్యులు అయిరి. శ్రీ కుమార్‌గారితో 48 వసంతములు వైభవోపేతము, శోభాయమానము, స్ఫూర్తివంతము, దివ్యము అగు జీవనము గడిపిరి. అది ఒక కన్యకు పెను మార్పు. ధీశక్తితో మార్పు నలవరచుకొని, ముందుకు సాగుటలో స్త్రీ విజయమున్నది. శ్రీమతి కుమారిగారు అట్టి ధీరత్వమునే ప్రదర్శించి అన్ని రంగముల విజయము సాధించినారు.

వివాహానంతరము దాంపత్య జీవనమున ప్రథమముగ కుమార్తెను, అటుపైన ఒక కుమారుని ఆశీఃఫలముగ పొందినారు. ఒక దౌహిత్రుడు, ఒక మనుమరాలు, ఒక మనుమని కూడ పొంది నారు.

శ్రీ కుమార్‌గారి జీవితము ఆది నుండియు సమిష్టియే. అనగా పదిమందితో కూడినది. వ్యక్తిగత జీవితము ఎన్నడును వారికి లిఖించబడి లేదు. కనుక కృష్ణకుమారిగారి జీవితము వ్యక్తిగతముగ గాక, పలువురికొరకై సమర్పింపబడినది. వివాహ సమయమునకు ఇంటిలో అత్తగారు, బావగారు, తోడికోడలు, ముగ్గురు మరుదులు ఉండిరి. అటుపైన 5 సం॥లలో మాస్టర్ ఇ.కె.గారి సాన్నిధ్యమున పరివారము పెరిగి, మాస్టర్ కుమార్‌గారి హయాములో వసుధైక కుటుంబమైనది. సంసారమెంత పెద్దదైనను నిర్భీతితో, ఉత్సాహముతో అందరిని తల్లివలె పోషించిన ధీమంతురాలు శ్రీమతి కుమారిగారు.

ఆమె ఏనాడు పొగడ్తలను ఆశించని నిర్మలమూర్తి.

## 5. మాస్టర్ ఇ.కె. ప్రవేశము :

శ్రీమతి కృష్ణకుమారిగారు సహజముగ కృష్ణ భక్తురాలు. ఆమెకు శ్రీకృష్ణుడన్న అమితమగు ప్రీతి. జీవితమున ఏసుక్రీస్తు స్పర్శ, షిరిడిసాయి స్పర్శ చిన్నతనముననే లభించినవి. తల్లి వలన శ్రీ సత్య సాయి. భర్త వలన మాస్టర్ ఇ.కె., మాస్టర్ సి.వి.వి. మరియు హిమాలయ గురుపరంపర సాన్నిధ్యము లభించినవి.



మాస్టరుగారి సాన్నిధ్యమున నిత్య షోడశోపచార పూజలు, అగ్నిహోత్రములు, అభిషేకములు, ధ్యానములు, వ్రతములు వంటి కార్యక్రమములలో మాస్టర్ కుమార్‌గారితో దీటుగ పాల్గొనుటయేగాక, మధుర కంఠధ్వనితో శ్రుతి కలిపెడివారు. వారిరువురిని చూచుటయే భక్త బృందములకు అమితానందముగ నుండెడిది. భక్తి శ్రద్ధలతో కూడిన వారి క్రతు నిర్వహణము ఇతరులకు మార్గదర్శకముగ నుండెడిది. వారి కంఠధ్వని చెవుల కింపుగ నుండెడిది. పై తెలిపిన క్రతువులు జగద్గురుపీఠమున, దేశవిదేశములలో, అన్ని భూఖండము లలో అశేష జనావళికి ఆదర్శమై నిలచెను. మాస్టర్ ఇ.కె. గారికి ఈ దంపతి క్రతు విధానము అమితమగు తృప్తి నిచ్చెడిది. సహధర్మ చారిణిగ శ్రీమతి కృష్ణకుమారిగారు ఆమె కామెయే సాటి.

## దినచర్య :

48 సం॥ల దాంపత్య జీవనమున కుటుంబ నిర్వహణమున మాతృశ్రీ కృష్ణకుమారిగారు ప్రతినిత్యము ఉషఃకాలముననే లేచెడివారు. మాస్టర్ కుమార్‌గారికన్న 30 ని॥ల ముందే నిదుర లేచెడివారు. శుచియై నిత్యము పది దీపములను వెలిగించి, తెల్లవారు జాముననే గృహమందు అన్ని దిశలలో ఏర్పాటు గావించేవారు. తులసికి దీపముతో మొదలుకొని శ్రీకృష్ణుని విగ్రహము వరకు ఇంటిలోని దేవతా గురుమూర్తులకు దీపము, ధూపము ఏర్పాటు గావించెడివారు. అటుపైన భార్యాభర్త లిరువురును ప్రార్థనకు అరగంట ముందుగ



కలసి కాఫీ సేవించెడివారు. అటుపైన ఆరుగంటలకు మాస్టరు సి.వి.వి. ప్రార్థనలందు పాల్గొని, పిమ్మట మాస్టర్ ఇ.కె. అందించిన పూజ లేక హోమము లేక అభిషేకము నిర్వర్తించెడివారు. అన్ని పూజలకు కూడ ప్రత్యేకముగ ఒక ప్రసాదము మరియు తీపి పదార్థము లను స్వయముగ వండి అందరకు పంచెడివారు. వంద మందికి ప్రసాదము అలవోకగ స్వయముగ నిర్వర్తించెడివారు. ఇట్టి సమయము లందు ఆమె శక్తి స్వరూపిణివలె గోచరించెడివారు. పూజా సమయమున స్తోత్ర పారాయణమున నిశ్చలముగ స్తోత్ర నిర్వహణము చేసెడివారు. పూజలయందు పుష్పాలంకారము ఆమెకు అమిత ప్రీతిగ నుండెడిది. మాస్టర్ కుమార్‌గారి కన్న పూజలయందు పుష్పముల వినియోగము అమ్మగారిదే మిక్కుటముగ నుండెడిది.



స్వాలంకృతయై పూజచేయుట ఆమెకు ఇష్టం. చక్కని పట్టు వస్త్రములను ధరించి, సున్నితమగు విలువైన ఆభరణములు ధరించి, శిరోజములందు పూలు ధరించి, పసుపు, కుంకుమ, పుష్పములు గంధము విరివిగ వాడుచు అమ్మవారిపూజ సాగెడిది. అర్ధనిమీలిత నేత్రములతో మాస్టర్ కుమార్‌గారి పూజ సాగుచుండగ, దేవతా లంకరణలో అమ్మగారి పూజ సాగెడిది. ఆమె హస్తము లెప్పుడును గోరింటాకుతో పవిత్రములై యుండెడివి. అట్లే పాదములు పసుపు పూతతో నుండెడివి.

నిత్యపూజలన్నియు  ఒక ఎత్తు, దుర్గాపూజలు ఒక ఎత్తు. దుర్గాపూజలలో మాతృశ్రీ కృష్ణకుమారిగారి విశ్వరూపము స్పష్టముగ గోచరించెడిది. 35 సంవత్సరములపాటు ఈ దంపతి ఎంతో




వైభవముగా నిర్వహించిన శరన్నవరాత్ర పూజలను శ్రీ దుర్గామాత అందుకొని అమ్మగారికి కైవల్య మిచ్చినది. తన కడకు కొనిపోయిన దనుటలో అతిశయోక్తి లేదు. దుర్గయన్న కృష్ణుడన్న ఒక్కటియే గదా!

## 6. బాధ్యతలు :

అమ్మగారి జీవితమంతయు ఎంత వైభవోపేతమో అంత బాధ్యతాయుతమై యుండెడిది. మరుదుల ఉపనయనము, వివాహాది శుభకార్యములు అన్నియును ఆమె చేతులమీదుగ సాగిపోవు చుండెడివి. తమ సంతానము పిన్నవయసులో అనేక విధములగు రుగ్మతలకు గురికాగ, పగలు రాత్రి విశ్రమింపక శుశ్రూషలు చేయు చుండెడివారు. మాస్టర్ ఇ.కె. ప్రత్యేక చికిత్సలలో యున్న వారికి ప్రత్యేకమైన వంటలు అమ్మగారిచే వండించి పంపించుచు నుండెడి వారు.

మాస్టర్ ఇ.కె. గారన్న అమ్మగారికి అమితమగు ప్రేమ, గౌరవము. మాస్టరుగారికి కూడ అమ్మగారి యందు అవ్యాజమగు ప్రేమ, వాత్సల్యము యుండెడివి. మాస్టరుగారు మనసెరిగి, వారు తెలుపకముందే వారికిష్టమైన ఫలాహారము, కాఫీ, భోజనమందు పచ్చళ్ళు, వేపుళ్ళు, ఊరగాయలు తినుపించు చుండెడివారు. "కుమారీ! నా కిష్టమైన టిఫిన్లు, పచ్చళ్లు వగైరాలు నీకెట్లా తెలుసు?" అని మాస్టరుగారు ప్రశ్నించినపుడు అమ్మగారి సమాధానము "కొన్ని విన్నవి, కొన్ని అనిపించినవి కారణంగా ఇలా చేస్తున్నాను మాస్టరుగారు" అని పలికెడివారు.




రాత్రి 11 గంటలకు మాస్టరుగారు రాధామాధవం చేరినా, వారి ఆకలెరిగి, దోశలో లేక నూరిన పచ్చళ్ళతోనో ఆహారం తినిపించే


వారు. మాస్టరుగారు అందరిలోను ఒకమారు ఇలా అన్నారు. **"కుమారీకి ఎదుటివారి ఆకలి తెలుసు. వారికేమిష్టమో తెలుసు. వారికి ఎంత ఆహారము సరిపడునో తెలుసును. ఇది అన్నపూర్ణతత్వం. అన్నపూర్ణ, మహాలక్ష్మి వీరిరువురు ఆమెయందు భాసిస్తారు. వాక్కునందు సత్యము సూటిగా భాసిస్తుంది. ఆమెకు లౌక్యం తక్కువ, అమాయకురాలు."**

ఏడు సంవత్సరములు స్వకుటుంబముతోపాటు మాస్టరుగారు, వారి శిష్య బృందమును ఎంతో బాధ్యతతో, ఓపికతో, ఓర్పుతో అమ్మ గారు భరించటం, కుమారునిగ చిన్నతనము నుండి నేను గమనించిన విషయము. ఆమె చలువ వలన నాకును వంట, వార్పు అబ్బినది. ఇట్టి విషయాలలో నాన్నగారైన శ్రీ కుమార్‌గారు బొత్తిగా ప్రవేశం లేనివారు అని చెప్పుటలో అతిశయోక్తి లేదు.

మాస్టర్ ఇ.కె. రాధామాధవమందున్న ఏడు సంవత్సరములు కాఫీలు, టీలు, దోశలు, పెసరట్లు, పూరీ కూరలు, చెట్నీలు, కందిపచ్చడి, పెసరపచ్చడి అమ్మగారి వంటింటిలోనుంచి ప్రవాహంలా సాగేవి. వంటకము ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. మాస్టరుగారికి ఆమెకు నడుమ ఆత్మీయత ప్రధానంగా నిలచియుండెడిది. **"ఆమె నా ఆత్మ పుత్రిక. ఆమె పిలిస్తే నే పలుకుతాను"** అని మాస్టర్ ఇ.కె.గారు అమ్మగారికి వరం ఇచ్చారు.

## 7. ధార్మిక ప్రవృత్తి :

మాస్టర్ ఇ.కె.గారి దేహత్యాగ అనంతరము అమ్మగారి జీవితాన మరియొక బాధ్యత ఏర్పడినది. మాస్టర్ కుమార్‌గారి భుజ స్కంధములపై మోపబడిన దివ్యప్రణాళిక బాధ్యతలో తనకూ భాగ మున్నదని గ్రహించిన అమ్మగారు, మాస్టర్ కుమార్‌గారిని మరింతగా అనుసరించడం ప్రారంభించారు. ఆమె భక్తి, రక్షణ, పోషణ నాన్నగారి యందు అనుపమానము. తాను కన్న సంతానము కన్న ఆమెకు భర్తయే ప్రధానమై నిలచినారు. మాస్టర్ కుమార్‌గారు అహర్నిశలు నిర్వర్తించు కార్యక్రమములకు తోడ్పాటు నిచ్చిరేగాని, ఎన్నడునూ ఆటంక పడలేదు. అమ్మగారికి ముప్పది సంవత్సరములు వచ్చినప్పటి నుండి



తన భర్త నెలల తరబడి ప్రాక్-పశ్చిమ ఆధ్యాత్మిక యజ్ఞ నిర్వహణము నకై విదేశము లేగినను సహకరించిరి. 1981 నుండి మాస్టర్ కుమార్‌గారు విదేశీయానములు ప్రతి సంవత్సరము నెలల తరబడి నిర్వర్తించిరి. 1994వ సం॥ నుండి అమ్మగారు కూడ విదేశీ యానములు చేయుచు, తెల్లజాతి వారికి, మన వారికి కూడ ఆదర్శ గృహిణి ఎట్లుండునో చెప్పకయే చెప్పుచు నుండెడివారు. ఆమెతో కూడి మాస్టరుగారు నిర్వహించిన యాత్రలు మరింత శోభాయ మానముగ నుండెడివి.

వైవాహిక జీవితమునకు, కుటుంబ వ్యవస్థకు, స్త్రీ శక్తికి, హుందాతనమునకు, ప్రేమ వాత్సల్యములకు మాతృశ్రీ కృష్ణకుమారి గారు ఒక చక్కని ప్రతీకగ విదేశీయులకు, స్వదేశీయులకు గోచరించెడి వారు. స్వదేశము వచ్చిన విదేశీయులకు 13 సం॥లు స్వహస్తముల తోనే వండి వడ్డించెడివారు. వారి రుచులకు తగినట్లుగ వండుట ఆమె ప్రత్యేకత.

విదేశములలో కూడ పర్వతారోహణము, పిరమిడ్ల ఆరోహణము చురుకుగ నిర్వర్తించేవారు. అట్టి సమయములలో ఆమెకు దేహ ధ్యాస యుండెడిది కాదు. కాళ్ళ నొప్పులు గుర్తుండెడివి కాదు.

ఒక మహాశివరాత్రినాడు 'హందూరా' దేశంలో గల 'తికాల్' అను ఎత్తైన పిరమిడ్ బృందముతో దర్శించుట జరిగినది. అమ్మగారికి మోకాలు నొప్పి, మెట్లు ఎలా ఎక్కగలరా యని అందరును చర్చించు

చుండగ, ఆమె "మిమ్ములగూర్చి చర్చించుకొనుడు. నన్ను గూర్చి నాకు వదిలివేయుడు" అని గంభీరముగ పలికి వడివడిగ నడచి, తానే పిరమిడ్ శిఖరాగ్రమును ముందుగ చేరిరి. అట్లే భారత దేశమున సప్తశృంగి పర్వతమును గూడ వడివడిగ అధిరోహించి బృందమునకు ఆశ్చర్యము కలిగించినారు.

పై తెలిపిన పిరమిడ్‌నకు 900ల మెట్లున్నవి. సప్తశృంగి పర్వతమునకు 1,000 మెట్లున్నవి. ఇట్టి సమయములలో ఆమె ధీశక్తి,



దేహాతీత స్ఫూర్తి బృందములకు ఆశ్చర్యము కలిగించు చుండెడిది. మోకాలు నొప్పులతోనే ఆమె కుమార్‌గారితో 18 సార్లు తిరుపతి తిరుమల ఏడు కొండలను కాలినడకన అధిరోహించారు. 12 కి.మీ.ల దూరం, 3,550 మెట్లు ఆమెకు ఎప్పుడూ అలసట నీయలేదు. "శ్రీవారితో కలిసి చనుటయే నా ప్రధాన లక్ష్యము. అందుకు నా మనస్సు, దేహము పరిమితములు కావు" అను సత్యము ఆమె వర్తనమందు తేటతెల్ల మగుచుండెడిది. తనయునిగ మాతృమూర్తి యందు నేను దర్శించిన సత్యమిది. ఆమె విదేశీయానము లన్నియు బాధ్యతాయుతములే. ఉల్లాసపూరితములు కావు. సహజముగ అమ్మగారు నాన్నగారివలెనే విలాసముల కతీతులు.

మాస్టర్ ఇ.కె.గారు ప్రారంభించిన ప్రాక్-పశ్చిమ ఆధ్యాత్మిక సమన్వయ యజ్ఞములో మాస్టర్ కుమార్‌గారికి ఎంత బాధ్యత యున్నదో, అట్టి బాధ్యత యందు ఆమె సహకారము కూడ అంత పరిపూర్ణముగ నుండెడిది. 65మార్లు మాస్టరుగారు నెలల తరబడి పశ్చిమ యాత్రలు చేసినారు. అందు 40 మార్లు అమ్మగారు కూడ చనుట జరిగినది. 33 మార్లు విదేశీ సదస్సులు రాధామాధవంలో జరిగినవి. అందు అమ్మగారి బాధ్యత మరింత ఎక్కువగ నుండెడిది. స్వదేశీయులకు, విదేశీయులకు ఒకే విధమగు ఆప్యాయతతో ఆదరించి అన్నం పెట్టిన తల్లిగ, ఆమె అందరికి తల్లిగ నిలచినది. స్త్రీ సంఘము లకు మార్గదర్శియై నిలచినది.

## 8. సమభావము :

అమ్మగారు సామాన్య కార్యకర్తల నుండి జగద్గురుపీఠం నందలి సభ్యుల నందరితోను సమభావంతో వర్తించెడివారు. 'నావాణి'కి పోస్టల్ స్టాంపులు అతికించడం నుండి, అతికించే జిగురువరకు సహకరిస్తూ ఉండేవారు. చిన్నపని, పెద్దపని అని తేడా ఆమె చూపెడివారు కాదు. ఏ పనికైనను సంసిద్ధురాలై యుండెడివారు. హోదా, గుర్తింపువంటి చిల్లర విషయములందు ఆమె కాసక్తి యుండెడిది కాదు. ఇంటి యందు ఎన్ని వాహన సౌకర్యము లున్నను నడచిపోవుటకు, ఆటోలో వెళ్ళుటకు సందేహించెడివారు కాదు. ఆమెకు పని ప్రధానము. సౌకర్యములు ప్రధానము కాదు. ఈ విషయమున ఆమె మాస్టర్ ఇ.కె. గారిని పోలియుండెడి వారు. నాకు స్ఫూర్తినిచ్చిన గుణములలో ఇది యొకటి.


అమ్మగారు ప్రాణమయ శరీరము ఎల్లప్పుడును పరిపుష్ఠముగ నుండెడిది. వారికి జలుబు, దగ్గు, జ్వరము, కడుపునొప్పులు, తలకాయ నొప్పులవంటివి ఎన్నడునూ శోకెడివి కాదు. అత్యంత చలి ప్రదేశము లలో కూడా ఆమెకు ఎన్నడునూ శరీరమున తేడా పడేది కాదు. కేవలము చెప్పులతోనే తిరుగుచుండెడి వారు. అప్పుడప్పుడు మాత్రమే మేజోళ్ళు వేసుకొనెడివారు. మోకాళ్ళ నొప్పులు, పాదముల నొప్పులు భరించెడివారుగాని, కార్యక్రమములు మానెడివారు కాదు. ఎక్కడ స్ఫూర్తి యుండునో అక్కడ దేహము సహకరించుట సహజము. ఈ

విషయమున ఆమెకు మాస్టర్ కుమార్‌గారే ఆదర్శము. మాస్టర్ కుమార్‌గారి ప్రాణశరీరము అమ్మగారి శరీరము కన్న బలహీనమైనది. తరచు అస్వస్థతకు గురియగు చుండెడిది. వారెన్నడు కార్యక్రమములు మానెడి వారు కాదు. అమ్మగారు కూడ ఆ విధానమునే అనుసరించిరి. వారు మాస్టరు గారి ప్రక్కన యుండుట అనగా, మనసా వాచా కర్మణ యుండెడి వారు. తనకున్న పనులన్నియు నెరవేర్చుకొనుచు, మాస్టరుగారి కార్యక్రమములలో కూడ బాధ్యతపడి యుండెడివారు. కేవలము ఫొటోలు తీయించుకొనుటకు ప్రక్కన చేరు స్వభావము ఆమెకు లేదు. సన్నిహితులకు మాత్రమే ఆమె లోతులు తెలిసి మాస్టరు గారితో సరిసమానముగ పూజించెడివారు.

అమ్మగారు అనుగ్రహించిన వారికి విజయము తప్పనిసరి. అమ్మగారి ఆగ్రహమునకు గురియైన వారికి విజయము అంతంత మాత్రమే. ఇది గ్రహించిన సభ్యులు ఆమె ధీశక్తికి, విజయశక్తికి నమస్కరించు చుండెడివారు.

### 9. లేఖనము :

మాస్టర్ ఇ.కె.గారి తెలుగు రచనలు, మాస్టర్ కుమార్ గారి తెలుగు రచనలు అన్నచో అమ్మగారికి ప్రాణప్రదము. తనకుగ ఒక ప్రతి నెప్పుడునూ ఏర్పరచుకొని, తీరిక సమయములలో చదువుకొను చుండెడివారు. మాస్టర్ కుమార్‌గారికి గృహమందు లేఖనము వారే నిర్వర్తించేవారు. సుదీర్ఘ విమానయానములలో గూడ వారిరువురును



రచనా కార్యక్రమ మందుండెడి వారు. వేయి నామములతో కూడిన లలితా సహస్రనామము లలో కొన్ని వందల నామము లకు వివరణము ముప్పదివేల (30,000) అడుగుల ఎత్తున ఆకాశములో జరిగినవి. నాన్న గారు చెప్పుచుండగ, అమ్మగారు వ్రాయుచుండెడి వారు. కార్యాలయమందు సోదరులు గంగు నాయుడుగారు, గృహమందు పర్యాటనముల యందు అమ్మ గారు మాస్టరుగారికి లేఖకులుగ వినియోగపడుట వలననే అనేకానేక తెలుగు పుస్తకములు, నావాణి యందు వ్యాసములు సిద్ధించినవి. వ్రాత పనికి ఆమె సంసిద్ధత కూడ పూర్ణము. ఉదయము కావచ్చును, మధ్యాహ్నము కావచ్చును, రాత్రి కావచ్చును, యాత్ర కావచ్చును- అన్ని సమయములందు రూళ్ళ పేపర్లు, రెండుపెన్నులు, ఒక అట్ట తనచేతి సామానులలో యుండెడివి.

మాస్టరుగారు తరచు తీసుకొను మందులు, ఇన్సులిన్ కూడ ఆమె చేతి సంచిలో నుండెడివి. కాంపౌండరువలె సమయమునకు

మందులు, ఇంజక్షన్లు 35 సం॥లు అందించిరి. మాస్టరుగారి ఆరోగ్య విషయమై ఆమె చూపిన శ్రద్ధ, తపన గణనీయము. ఆమెకు మాస్టరుగారు కుడి కన్నైతే, సంతానము ఎడమ కన్ను. గురువు, దైవము మూడవ కన్ను. ఆమెకు ధ్యానమున తరచు భ్రూమధ్యము, ఆజ్ఞాకేంద్రము నడుమ నీలమగు కాంతి, నక్షత్రములు గోచరించు చుండెడివి.

## 10. దానగుణము :

దానమునందు, వితరణమునందు నాన్నగారికన్న అమ్మగారిదే పైచేయి. విదేశముల నుండి వచ్చిన వారందరికి భోజనములు పెట్టి, అంతకన్నమిన్నగ వస్త్రముల నిచ్చి ఆశీర్వదించిరి. రాధామాధవం వచ్చినవారు వట్టి చేతులతో వెళ్లుట అరుదుగ నుండెడిది. అట్లే గురుపూజా కార్యక్రమములకై ఇతర కేంద్రముల కేగినపుడు అచ్చటి కార్యకర్తలందరకు కూడ నూతన వస్త్రములు ఆశీర్వచనముగ ప్రదానము చేసెడివారు. పంచిపెట్టుటలో ఆమె పొందిన ఆనందము చూచుట చూచువారికి ఆనందముగ నుండెడిది. సద్విషయములకు ధనము విరివిగ వితరణ చేయు హస్తమామెది. అట్టి సమయములలో ఉత్సాహము ఉరకలు వేయుచుండెడిది.

## ఎ) విమర్శలు :

ప్రశంస లున్నచోట విమర్శ కూడ యుండును. ఆమెను గూర్చిన విమర్శలు ఆమె చెవినబడినపుడు మానసికమగు బాధ

ననుభవించెడివారు. అట్టి సమయములలో భజనము, గానము నిర్వర్తించుచు ఊరట పొందెడివారు.

## బి) సహవేదన :

బృందమున ఎవరికి అనారోగ్యముగ నున్నను అది వినిన వెంటనే అమ్మగారు సహవేదన చెందెడివారు. వారి బాగోగులు నిత్యము కనుగొనెడివారు. అట్లే ఎవరైన దూరప్రయాణమునకు ఉద్యుక్తులైనపుడు చేరిన వెంటనే తెలుపమని కోరెడివారు. అపుడపుడు ప్రయాణమైన వారి గూర్చి గుర్తుతెచ్చుకొను చుండెడివారు. అవ్యక్తమగు మాతృత్వము ఆమె నా విధముగ ఒత్తిడికి గురిచేయు చుండెడిది.

## 11. ముగింపు :

మాతృశ్రీ కృష్ణకుమారిగారు సూటియైన ప్రవర్తన గలవారు. అత్యంత క్రమశిక్షణతో యుండెడివారు. శ్రమకోర్చి పనిచేసెడివారు. పనియందు నిశితముగ నుండెడివారు. ఆమె సంకల్పబలము సుస్థిరము. భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు ఆమె సుస్థిరతను ప్రశంసించినారు. వారి మార్గము భక్తిమార్గము. సేవ ఆమె సహజ లక్షణము. ఆమె పతిభక్తి, గురుభక్తి, దైవభక్తి ఆదర్శనీయము. ఆధునిక కాలమున ఇట్టి పుణ్యమూర్తులు అరుదుగ నుందురు. ఆమె స్వభావము నందు దివ్యత్వము స్పష్టముగ గోచరించు చుండెడిది. మాస్టర్ పార్వతీ



కుమార్‌గారు, మాతృశ్రీ కృష్ణకుమారిగారు అర్ధనారీశ్వర స్వరూపము నకు ఒక చక్కని ప్రతీకగ భౌగోళికముగ ఆదరింపబడు చున్నారు.


## 12. మరణము - పుణ్యలోకప్రాప్తి :

"జాతస్య మరణం ధ్రువం" పుట్టినదెల్ల మరణించుట సృష్టి ధర్మము. మనసేంద్రియ దేహములు శాశ్వతుడగు జీవునకు ఏర్పడి నపుడు పుట్టుటనియు, అవి నశించినపుడు మరణించుటయని లోకులు భావింతురు. నిజమునకు జీవుడు శాశ్వతుడు. లోకానుభూతికై శరీరము దాల్చుచుండును. వర్తించిన తీరుబట్టి పుణ్యలోక ప్రాప్తి కలుగుచు నుండును.

మాతృశ్రీ కృష్ణకుమారిగారు చైత్ర బహుళ దశమి, శుక్రవారం

నాడు ధనిష్ఠ తారయందు దేహమును 10 ని॥లలో తమ కుమారుని ఒడిలో (అనగా నేను) వీడినారు. ఆమె జననము శతభిషంలో జరిగింది.

గత రెండు సం॥లుగ మాస్టర్ కుమార్‌గారి ఆరోగ్యం క్షీణిస్తూ ఉన్నది. 2018 సం॥ము జనవరి గురుపూజలు అనంతరము మాస్టరుగారికి శరీరమున నీరసము ఆవరించినది. ఆకలి, రుచి క్షీణించినవి. వాసన పూర్తిగ తగ్గినది. కాని 2020 సం॥ విజయవాడ గురుపూజలవరకు ఆయన కార్యక్రమములకు ముందుగనే కట్టుబడి యుండుటచే, వానిని నిర్వర్తించుటకు నిశ్చయించుకొనినారు. కార్యక్రమము లన్నియు అమ్మగారితో కూడి పరిపూర్తి గావించారు. అందు రెండు సుదీర్ఘమగు విదేశీయాత్రలు గూడ యున్నవి. మాటకు కట్టుబడు స్వభావము మాస్టరుగారిది. ఆరోగ్యమును ప్రక్కన బెట్టి



కార్యములు నిర్వర్తించుట వారి ప్రత్యేకత. వారి అనారోగ్యము అమ్మగారికి ఎపుడునూ ఆందోళనగనే యుండెడిది.

2020 సం॥ము ఫిబ్రవరి 14వ తేదీ నాటికి ఇచ్చిన మాట ప్రకారము కార్యక్రమములు నిర్వర్తింపబడినవి. రచనా కార్య క్రమములు కూడ పూర్తియైనవి. ఏసుక్రీస్తు జీవితమును గూర్చి రచించిన పుస్తకముగూడ ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తియైనది. మాస్టరుగారు, అమ్మగారితో 'ఇక మనం వ్రాయవలసిన కార్యక్రమము పూర్తి అయినది. తిరుగవలసిన కార్యక్రమాలు కూడ ఏమీ లేవు. అందరిని వారి స్వావలంబనమునకు సిద్ధము చేయుట 5 సం॥లుగ నిర్వర్తించుచునే యున్నాను. 48 సం॥లు వైవాహిక జీవితంలో ఇపుడు నీకు నాకు కాలపురుషుడు విశ్రాంతిని ప్రసాదించాడు. రాధా మాధవంలో ప్రార్థనలు చేసుకొంటూ, అడిగిన వారికి సలహా సహకారములు, సహాయము అందిస్తూ విశ్రాంతిగ జీవించుదాం. పెళ్ళిళ్ళు ఇత్యాది శుభకార్యాలకు ఇక్కడినుండే ఆశీర్వచనం అందించు దాము. ఇక తిరగటం, వ్రాయటం యుండవు. దైవారాధనము, కుటుంబము ఉంటుంది" అని పలికారు.

ఆరోగ్యమును గూర్చి పరిశీలించుకోవలసిన పరిస్థితి యున్నది గనుక, 14 రోజులు పాటు అనేక వైద్య పరీక్షలు మాస్టరుగారికి నిర్వర్తించడం జరిగినది. అందు తేలిన విషయాలు అమ్మగారికి లోన భయముగ ఏర్పడి గుండెలు బరువెక్కినాయి. కాని అది

గమనికకు రాలేదు. 14-04-2020 తేదీన మాస్టరుగారిని ఆసుపత్రిలో చేర్చటం ఆమెకు చాల నిరాశ కలిగించింది.



1985 సం॥ జూన్ నెలలో మాస్టరుగారికి తీవ్ర అనారోగ్యము కలిగి 30 రోజులు ఆసుపత్రిలో యున్నను, ఆమె చెంత నుండి సేవ చేసినారు. 2006 సం॥ డిసెంబరు నెలలో మాస్టరుగారు గుండె చికిత్సకై ఆసుపత్రిలో చేరినను స్థిరమగు చిత్తముతో వర్తించినారు. మూడవమారు ఇపుడు 2020 సం॥ము ఏప్రిల్ 14న మాస్టరు

కుమార్‌గారు ఆసుపత్రిలో చేరినపుడు అమ్మగారు ఆందోళన చెందటం నేను గమనించాను. అమ్మగారితో స్వయముగ ఇట్లు పలికినాను. "నాన్నకు దైవ, గురు బలము యున్నమాట సత్యం. నీకును, నాకును ఇది అనుభవ పూర్వకమే. నీవిపుడు ఆందోళన చెంది అనారోగ్యం కొనితెచ్చుకొనవద్దు."

తేది 17-4-2020 శుక్రవారం ఉదయం మాస్టర్ కుమార్ గారు స్పృహ కోల్పోయారన్న విషయము వైద్యులు తెలిపినపుడు అమ్మగారు హతాసు అయిపోయినారు. ఆమెను నేనే ఇంటికి కొనివచ్చి స్వస్థవాక్యములు పలికాను. ఆమెకు మధ్యాహ్నం గం॥ 1.30 ని॥లకు చలి వచ్చింది. గం॥ 1.55 ని॥లకు శ్వాస తగ్గటం, దేహమును వీడటం నా ఒడిలోనే జరిగినది. ఆమె ఒడిలో పెరిగిన నేను, నా ఒడిలో ఆమెను సాగనంపటం ఒక అనిర్వచనీయమైన అనుభూతిగ నాయందు లోతుగ నిలచిపోయినది. ఆ మరునాడు ఉదయానికే మా తండ్రిగారైన మాస్టర్ కుమార్‌గారు స్పృహలోనికి రావటం జరిగింది.

ఇది ఒక అపురూపము, అమితాశ్చర్యము కలిగించిన ఘట్టం. మాస్టరుగారి అనుయాయులు, మిత్రులు, బంధువులు ఆశ్చర్యచకితు లైనారు. నిశ్చేష్టులైనారు. తేది 18-4-2020 నాడు మాస్టర్ కుమార్ గారిని ఆసుపత్రి నుండి ఇంటికి కొనివచ్చి, తేది 20-4-2020 ఆదివారంనాడు దహన క్రియలు మాస్టరుగారి సమక్షంలో ప్రారంభ



మయ్యాయి. అమ్మగారు వెళ్లిపోయారని నాన్నగారికి తెలుపగ, వారు నిర్లిప్తంగా, "నాకు రెండు రోజులు ముందే తెలుసు" అని పలికారు. 44 సం॥ల నా జీవితంలో గత 5 రోజుల అనుభవము అత్యంత గంభీరముగ నిలచిపోయింది.

శ్రీమతి కుమారి, శ్రీ కుమార్‌గార్లు నాకు జన్మనిచ్చిన తల్లి దండ్రులు. వారొకరికొకరు అత్యంత సన్నిహితులు. ఆదర్శమూర్తులు. వారిని విడదీయుట విధికైననూ అసమ్మతమే. శ్రీ కుమార్‌గారిని ఆసుపత్రికి పంపి, స్పృహ కోల్పోజేసి, శ్రీమతి కుమారీగారిని విధి గొనిపోయిందని నాకు, సన్నిహితులకు భాసించింది. వారు యిరువురు దివ్య ప్రయోజనమునకు చెందినవారు. అందరికీ ఆదర్శంగా నిలిచారు.

మాతృమూర్తి కృష్ణకుమారిగారు పుణ్యశీలి. సూటియగు ప్రవర్తన గలవారు. ఆమె పుణ్యస్త్రీగా ఊర్ధ్వలోక ప్రాప్తిని పొందినారు. అది ఆమె ప్రగాఢమగు కోరిక. మాస్టర్ కుమార్‌గారు లేని జీవితము ఆమె ఎన్నడునూ ఊహించలేదు. తాను పుణ్య స్త్రీగనే పోవలెనని, ఆసుపత్రి పాలు కారాదని, రాధామాధవం నందే దేహము చాలించా లని పదే పదే పలుకుతు ఉండెడివారు. అమ్మగారు అన్ని విషయము లందు కృతకృత్యురాలైనారు. ఆమె ఎందరికో తన ప్రేమ, అనురాగము లను పంచిపెట్టినారు. ఆమె అందరికిని అమ్మగ జగద్గురుపీఠంలో భౌగోళికంగా విరాజిల్లుచున్నారు. 111వ మే కాల్ ఉత్సవమును భౌగోళిక జగద్గురుపీఠం ఆమెకు స్మృత్యంజలిగ అర్పించినారు.

*మాతృదేవోభవ!*

**– గురుప్రసాద్ కంభంపాటి**

# DHANISHTA PUBLICATIONS

D.No. 15-7-1, Angels' Enclave, Krishna Nagar,
Visakhapatnam - 530 002.
Phone : 0891- 2701531, 2509154

## WRITINGS OF MASTER PARVATHIKUMAR

| | | |
|---|---|---|
| 1. | Agni | E |
| 2. | A Clean Life | E/G/S |
| 3. | Adhyatmika Gigyasa | K |
| 4. | Amanaskudu | K/T |
| 5. | Ambareeshudu | T |
| 6. | Antardarsana Dhyanamulu | T/K |
| 7. | Anveshakudu | T |
| 8. | Asangudu | T/K |
| 9. | Aries | E |
| 10. | Ashram | E |
| 11. | Ashram Leaves | E/G/S |
| 12. | Ashram Regulation for Entry | E/G/S |
| 13. | An insight into the WTT | E |
| 14. | Atmasadhana Sutramulu | T |
| 15. | Avathara of Synthesis | E |
| 16. | Ayurvedic Principles of Daily Life | E/G/S |
| 17. | Bharatiya Sampradayamu | T/K/Hi |
| 18. | Book of Prayers | E |
| 19. | Bhagavathamurthy Bheeshmudu | T |
| 20. | Bricks for the Temple | E |

**Website : www.dhanistha.org. info@dhanistha.org.**

| | | |
|---|---|---|
| 21. | Cow | K/T/E/Hi |
| 22. | C.V.V. - Mastaru Yogamu - Sadhana Sutramulu | T |
| 23. | Devapi Maharshi Bodhalu 1 & 2 | T/E/K/Hi |
| 24. | Dharmavigrahudu - Sri Ramudu | T |
| 25. | Dhanakamuni Katha | T |
| 26. | Doctrine of Eternal Presence | E |
| 27. | From the Teachers Pen | E |
| 28. | Gayatri Mantra Avagahana | T |
| 29. | Geetopanishad - Gnana Yogamu | T |
| 30. | Geetopanishad - Dhyana Yogamu | T |
| 31. | Geetopanishad - Karma Yogamu | T |
| 32. | Geetopanishad - Sankya Yogamu | T |
| 33. | Geetopanishad - Karma Sanyasa Yogamu | T |
| 34. | Geetopanishad - Vijnana Yogamu | T |
| 35. | Geetopanishad - Akshra Parabrahma Yogamu | T |
| 36. | Geetopanishad - Rajavidya Rajaguhya Yogamu | T |
| 37. | Good Friday | E/S |
| 38. | Healers Handbook | E |
| 39. | Health & Harmony | E/G |
| 40. | Health & Harmony-2 | E |
| 41. | Hercules - The Man and the Symbol | E/G/S |
| 42. | Himalaya Guruparampara | T/Hi/K |
| 43. | Jupiter - The Path of Expansion | E/G/S |
| 44. | Just Adjust | E |
| 45. | Jyotirlinga Yatra | T |
| 46. | Kapila and Kardama | E/G/S |
| 47. | Katha Deepika | T |

| | | |
|---|---|---|
| 48. | Kumara Sambavam | T |
| 49. | Lectures on Secret Doctrine - I | S/E |
| 50. | Lectures on Secret Doctrine - II | E |
| 51. | Lectures on Secret Doctrine - III | E |
| 52. | Listening to the Invisible Master | E/S/K |
| 53. | Lord Maitreya - The World Teacher | E/S |
| 54. | Life and Teachings of Master Jupiter | E |
| 55. | Maitreya Maharshi Bodhalu 1 & 2 | T/K/E/Hi |
| 56. | Mana Master garu | T |
| 57. | MANTRAMS - Their Significance and Practice | E/G/S |
| 58. | Mars - The Kumara | E/G/S |
| 59. | Mercury - The Alchemist | E/G/S |
| 60. | Maria Magdalena | E/S |
| 61. | Marriage - A Sublime Sacrament | E/G/S |
| 62. | Maruvu Maharshi Bodhalu 1 & 2 | T/K/Hi/E |
| 63. | MASTER C.V.V. (Birthday Message) | T/K/E |
| 64. | MASTER C.V.V - Nuthana Yogamu | T/K |
| 65. | MASTER C.V.V. - Yogamu | T |
| 66. | MASTER C.V.V. - Yogamu (Karma Rahityamu) | T/k |
| 67. | Master K. Parvathi Kumar - Short Biography | E |
| 68. | Master CVV - Saturn Regulations | E/G/S |
| 69. | MASTER CVV The Initiator - MASTER E.K. The Inspirer | E |
| 70. | Master M.N. - A Fiery Flame | E/G/S |

The Books are available in English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (Hi) and Kannada (K) Languages.







"కుమారీకి ఎదుటివారి ఆకలి తెలుసు. వారికేమిష్టమో తెలుసు. వారికి ఎంత ఆహారము సరిపడునో తెలుసును. ఇది అన్నపూర్ణతత్వం. అన్నపూర్ణ, మహాలక్ష్మి వీరిరువురు ఆమెయందు భాసిస్తారు. వాక్కునందు సత్యము సూటిగా భాసిస్తుంది. ఆమెకు లౌక్యం తక్కువ, అమాయకురాలు."

'ఆమె నా ఆత్మ పుత్రిక. ఆమె పిలిస్తే నే పలుకుతాను."

- మాస్టర్ ఇ.కె.

ISBN 978-81-89467-46-3

ధనిష్ఠ